# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

# విశాఖపట్నం కేంద్రం

# ప్రాంతీయ వార్తలు

తేదీ: 16-08-2024 సమయం : సాయంకాలం 6 గం. 10 ని.లు

## ముఖ్యాంశాలు

- అన్న క్యాంటిన్ల ఏర్పాటు ద్వారా రాష్ట్ర ప్రభుత్వం పేదల ఆకలికి స్వస్తి పలికిందని విద్యా శాఖ మంత్రి నారా లోకేష్ పేర్కొన్నారు.
- భారత ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్ కర్ రేపు శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లాలో పర్యటించనున్నారు.
- భవన నిర్మాణాలకు సంబంధించిన మార్గదర్శకాలలో మార్పులు చేపడతామని రాష్ట్ర పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పి. నారాయణ తెలిపారు.
- ప్రభుత్వ ఆసుపత్రుల మెరుగైన పనితీరు కోసం 30 అంశాలతో కూడి కార్యాచరణ రూపొందిస్తున్నామని వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ తెలియజేశారు.
- సర్దార్ గౌతు లచ్చన్న కుల, మత, ప్రాంతాలకు అతీతంగా అందరూ అభిమానించే నాయకుడని మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అన్నారు.

==============================

అన్న క్యాంటిన్ల ఏర్పాటు ద్వారా రాష్ట్ర ప్రభుత్వం పేదల ఆకలికి స్వస్తి పలికిందని రాష్ట్ర విద్యా శాఖ మంత్రి నారా లోకేష్ అన్నారు. గుంటూరు జిల్లా మంగళగిరి నియోజకవర్గం తాడేపల్లి నులకపేట లోను, పాత బస్టాండ్ వద్ద ఏర్పాటు చేసిన అన్న క్యాంటీన్లను ఈరోజు ఆయన ప్రారంభించారు. అన్న క్యాంటీన్ వెబ్ సైట్ వివరాలను సిబ్బందిని అడిగి తెలుసుకొని, టోకెన్ జారీ ప్రక్రియను, విరాళాల కోసం రూపొందించిన వెబ్ సైట్ ను పరిశీలించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ... అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లోనే అన్న క్యాంటీన్లను ఏర్పాటు చేసి, హామీని నిలబెట్టుకున్నామన్నారు. ప్రస్తుతం 100 అన్న క్యాంటీన్లను ప్రారంభించామని, మిగతా వాటిని కూడా త్వరలో సిద్ధం చేస్తామని మంత్రి పేర్కొంటూ...

(వాయిస్ 20 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

భారత ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్ కర్ రేపు శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లాలో పర్యటించనున్నారు. రేపు తిరుపతి విమానాశ్రయం నుంచి ప్రత్యేక హెలికాప్టర్ లో బయలుదేరి, వెంకటాచలం మండలం సరస్వతి నగర్ లోని అక్షర విద్యాలయానికి వెళతారు. పూర్వ ఉప రాష్ట్రపతి ఎం. వెంకయ్య నాయుడు తోకలిసి నైపుణ్యాభివృద్ధి కేంద్రాన్ని సందర్శించి, యువతకు అందిస్తున్న వివిధ కోర్సులను పరిశీలిస్తారు. అనంతరం వెంకటాచలంలోని స్వర్ణ భారత్ ట్రస్టు 23వ వార్షికోత్సవ కార్యక్రమంలో పాల్గొంటారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

రాష్ట్రంలో భవన నిర్మాణాలకు సంబంధించిన మార్గదర్శకాలలో మార్పులు చేస్తామని రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పి. నారాయణ తెలిపారు. నెల్లూరు నగరపాలక సంస్థ అధికారులతో ఈరోజు ఆయన సమీక్ష నిర్వహించారు. దేశంలోని వివిధ రాష్ట్రాలలో భవన నిర్మాణాలకు అనుసరిస్తున్న విధానాలు... భవన నిర్మాణం పూర్తయ్యాక మార్ట్ గేజ్ రిలీజ్ విధానం, నిర్మాణాల్లో డీ-వియేషన్, లే-అవుట్ల ఏర్పాట్లు, తదితర అంశాలను పరిశీలించిన తరువాత అధికారులు నివేదిక సమర్పిస్తారన్నారు. ఈ నివేదికపై చర్చించి రాష్ట్రంలో నూతన విధానాన్ని తీసుకువస్తామని మంత్రి వెల్లడించారు. నగర పాలక, పురపాలక సంస్థల్లో టౌన్ ప్లానింగ్ విభాగం పైనే ప్రధానంగా ఆరోపణలు వస్తున్నాయని, ఆ విభాగాన్ని కూడా ప్రక్షాళన చేయాలని నిర్ణయించామన్నారు. ఒత్తిళ్ళకు తలొగ్గకుండా నిబంధనల ప్రకారమే వ్యవహరించాలని మంత్రి ఈ సందర్భంగా అధికారులకు సూచించారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

ప్రభుత్వ ఆస్పత్రుల మెరుగైన పనితీరు కోసం 30 అంశాలతో కూడిన కార్యాచరణ రూపొందిస్తున్నామని వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ తెలిపారు. ఈరోజు ఆయన సచివాలయంలో పాత్రికేయులతో మాట్లాడుతూ... ప్రభుత్వాసుపత్రుల్లో సానుకూల వాతావరణం కల్పించేలా చర్యలు తీసుకుంటామని, ప్రత్యేకించి సరైన నిర్వహణ, పారిశుద్ధ్యం, ఓపీ సేవలు, సిబ్బంది హాజరుపై దృష్టి సారిస్తామని పేర్కొన్నారు. ఈ ప్రణాళికను స్వల్ప, మధ్య, దీర్ఘకాలిక చర్యల ద్వారా అమలు చేస్తామన్నారు. ఆరోగ్య, కుటుంబ సంక్షేమశాఖ, వైద్య విద్య మంత్రిత్వ శాఖ, అనుబంధ బోధనాస్పత్రులతో పాటు, ప్రభుత్వ సర్వజన ఆసుపత్రుల నిర్వహణ, ఆరోగ్య సంరక్షణ సేవల నాణ్యత లక్ష్యంగా ఈ ప్రణాళికను రూపొందిస్తున్నట్టు మంత్రి పేర్కొంటూ...

(వాయిస్ 37 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

సర్దార్ గౌతు లచ్చన్న కుల, మత ప్రాంతాలకు అతీతంగా అందరూ అభిమానించే నాయకుడని వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అన్నారు. శ్రీకాకుళంలో తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో ఈరోజు జరిగిన గౌతు లచ్చన్న 115వ జయంతి వేడుకల్లో మంత్రి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... రాష్ట్ర రాజకీయ చరిత్రలో స్వాతంత్ర్యానికి ముందు స్వాతంత్ర్యం తరువాత ప్రభావితం చేసే నాయకుల్లో గౌతు లచ్చన్న అగ్రగణ్యులని వ్యాఖ్యానించారు. స్వాతంత్ర్య సంగ్రామంలో పాల్గొనడంతో పాటు ఎన్నో ఉద్యమాలు నడిపిన నిష్కళంక నాయకుడని ప్రశంసించారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు గౌతు లచ్చన్నకు సముచిత రీతిలో గుర్తింపు, గౌరవం ఇచ్చారని... తోటపల్లి ప్రాజెక్టుకు ఆయన పేరు పెట్టారని మంత్రి గుర్తు చేశారు.

విరామం

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

విశాఖ జిల్లా స్థానిక సంస్థల శాసనమండలి ఉప ఎన్నికలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి బొత్స సత్యనారాయణ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ మేరకు జిల్లా కలెక్టరేట్ లో ఎన్నికల రిటర్నింగ్ అధికారి మయూర్ అశోక్... ధృవీకరణ పత్రాన్ని బొత్స సత్యనారాయణకు అందజేశారు. ఈ సందర్భంగా బొత్స సత్యనారాయణ మాట్లాడుతూ... ఎన్నిక ఏకగ్రీవం కావడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. తనకు బి-ఫామ్ ఇచ్చిన వైసిపి అధిష్టానానికి, జిల్లాలోని వివిధ రాజకీయ పక్షాల నేతలకు కృతజ్ఞతలు తెలిపారు. కాగా స్వతంత్ర అభ్యర్థి నామినేషన్ ను ఉపసంహరించుకోవడంతో ఈ ఎన్నిక ఏకగ్రీవమైంది.

==================================

కాన్ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఇండస్ట్రీ (CII) డైరెక్టర్ జనరల్ చంద్రజిత్ బెనర్జీ.. రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుతో ఈరోజు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా సీఐఐ ద్వారా అమరావతిలో గ్లోబల్ లీడర్ షిప్ సెంటర్ (GLC) ఏర్పాటుపై చర్చించారు. ఆర్థికాభివృద్ధిపై టాస్క్ఫోర్స్ సిఫార్సులకనుగుణంగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం, సీఐఐ ఇండస్ట్రీ ఫోరమ్ ఏర్పాటు చేసేలా సాధ్యాసాధ్యాలను పరిశీలిస్తున్నామని ముఖ్యమంత్రి సామాజిక మాధ్యం ఎక్స్‌లో పేర్కొన్నారు. సీఐఐ మల్టీ స్కిల్ ట్రైనింగ్ ఇన్‌స్టిట్యూట్, సీఐఐ మోడల్ కెరీర్ సెంటర్ వంటి కార్యక్రమాల ద్వారా రాష్ట్ర యువతలో నైపుణ్యాలు, ఉపాధిని పెంపొందించడంపై దృష్టి పెడతామని చంద్రబాబు నాయుడు తెలిపారు.

==================================

ఎన్నికలలో ఇచ్చిన ప్రతి హామీని తప్పని సరిగా అమలు చేస్తామని రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ తెలిపారు. బాపట్ల జిల్లా అద్దంకిలో ఏర్పాటు చేసిన అన్న క్యాంటీన్ ను మంత్రి ఈరోజు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... విద్యుత్ వ్యవస్థలో మార్పులు చేపట్టామని, ఈ క్రమంలోనే విద్యుత్ రంగంలో అనేక ఒప్పందాలు జరుగుతున్నాయని, సౌర విద్యుత్ వ్యవస్థను పటిష్టం చేసే ఆలోచన చేస్తున్నామని తెలిపారు. ప్రభుత్వ కార్యాలయాలకు సౌర విద్యుత్ అందించే కార్యక్రమం జరుగుతుందన్నారు. అధికారం చేపట్టాక ఇప్పటివరకు 45 వేల వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లు ఇవ్వటం జరిగిందని మంత్రి ఈ సందర్భంగా తెలియజేశారు.

==================================

వరలక్ష్మీవ్రతాన్ని రాష్ట్ర వ్యాప్తంగా మహిళలు భక్తి శ్రద్ధలతో జరుపుకున్నారు. ఈ పండుగ సందర్భంగా రాష్ట్రంలోని ఆలయాలు, ప్రత్యేకించి గ్రామ దేవతల ఆలయాల్లో భక్తుల సందడి నెలకొంది. అన్ని ప్రధాన దేవాలయాల్లోనూ ప్రత్యేక పూజలు నిర్వహించగా మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఉత్తరాంధ్రుల ఇలదైవం విశాఖలోని శ్రీ కనక మహాలక్ష్మి అమ్మవారి ఆలయంలో వరలక్ష్మీవ్రత ప్రత్యేక పూజలు భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. అమ్మవారు శ్రీమహాలక్ష్మి అవతారంలో స్వర్ణాలంకార శోభితంగా భక్తులకు దర్శనమిచ్చారు. వేకువ ఝామునే వేదమంత్రోచ్ఛారణల మధ్య పంచామృతాభిషేకాలు నిర్వహించారు. అనంతరం అమ్మవారిని స్వర్ణాభరణాలతో అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. ఆలయ ప్రాంగణంలో సామూహిక కుంకుమ పూజలు కూడా నిర్వహించారు.

==================================

ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా సుపరిపాలన అందించడమే జాతీయ ప్రజాస్వామ్య కూటమి ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర గృహ నిర్మాణం, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారధి అన్నారు. ఈరోజు ఆయన నూజివీడులో అన్న క్యాంటిన్ ను ప్రారంభించిన అనంతరం మాట్లాడుతూ... రాష్ట్రంలో వ్యవసాయ, పారిశ్రామిక రంగాలతో పాటు అన్ని రంగాలను అభివృద్ధి పథంలో నడిపించి, యువతకు ఉజ్వల భవిష్యత్తు అందించేందుకు ముఖ్యమంత్రి కృషి చేస్తున్నారన్నారు. ఎన్టీఆర్ భరోసా పెన్షన్లను 65 లక్షల మందికి ప్రతీ నెలా ఇంటివద్దే అందిస్తున్నామన్నారు. 16 వేల 700 పోస్టులతో “మెగా డీఎస్సీ”కి ప్రకటన విడుదల చేశామని మంత్రి ఈ సందర్భంగా తెలియజేశారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

పార్వతీపురం మన్యం జిల్లాలోని పాచిపెంట మండలాన్ని పర్యాటకంగా అభివృద్ధి చేస్తామని రాష్ట్ర మహిళా, శిశు సంక్షేమ, గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మడి సంధ్యారాణి తెలిపారు. ఈరోజు ఆమె పాచిపెంట మండలంలో పారమ్మ దేవత గుడికి కొండపైకి వెళ్ళే రహదారి నిర్మాణ పనులకు శంఖుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... సాలూరు నియోజకవర్గంలో 20 కోట్ల రూపాయలతో పర్యాటక పనులు ప్రతిపాదించామని, అందులో దాదాపు 12 కోట్ల రూపాయల పనులు మంజూరు అయ్యే అవకాశం ఉందన్నారు. త్వరలో పాచిపెంట, సాలూరు గిరిజన మండలాలకు అన్న క్యాంటీన్ లు మంజూరు చేస్తామని తెలిపారు. నియోజక వర్గంలో 31 గ్రామాలకు తాగునీటి పనులు మంజూరు అయ్యాయని, అన్ని గిరిజన గ్రామాల్లో “జల్ జీవన్ మిషన్” కింద ఇంటింటికి తాగునీటి కుళాయిల ఏర్పాటుకు చర్యలు చేపట్టామన్నారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =